


8వ రోజు కొనసాగిన టెట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరుసిటీ


విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

జిల్లా కేంద్రమైన ఏలూరులో టెట్ పరీక్షలు మంగళవారం ఎనిమిదో రోజు కొనసాగాయి. సిద్ధార్థ క్వెస్ట్ కాలేజ్‌లో నిర్వహించిన పరీక్షల్లో ఉదయం పరీక్షకు 155 మంది హాజరు కావాల్సి ఉండగా 109 మంది హాజరయ్యారు. 46 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 77 మందికిగాను 58 మంది హాజరయ్యారు. 19 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డిఇఒ అబ్రహం తెలిపారు.

టిక్కెట్ 'చింత'..!

'తమ నాయకుడికి టిక్కెట్ వస్తుందా.. రాదా, ఒకవేళ రాకపోతే పరిస్థితి ఏమిటి? ఒకరికి టిక్కెట్ ఇస్తే మరో నాయకుడు సహకరించే అవకాశం ఉంటుందా'.. ఇలాంటి అనేక ప్రశ్నలు టిడిపి, జనసేన పార్టీల్లోని ఆశావహుల అనుచరగణాన్ని వేధిస్తున్నాయి. పొత్తులో భాగంగా టిడిపి, జనసేన కూటమి రెండు జిల్లాల్లో ఏడు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన స్థానాల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. ఇప్పటికీ టిక్కెట్ ఖరారు కాకపోవడంతో సీనియర్ నాయకులు సైతం తమ నియోజకవర్గాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



- టిడిపి, జనసేనలో టిక్కెట్ల గందరగోళం
- దెందులూరులో చింతమనేనికి తప్పని తలనొప్పి
- ఉంగుటూరులో గన్నికి గడిగడి గండం
- నరసాపురం టిక్కెట్‌పై జనసేనలో పందేల జోరు
- తాడేపల్లిగూడెంపై వీడని ఉత్కంఠ
- టిక్కెట్ కోసం సీనియర్ నేతల ఎదురీత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి, జనసేన పార్టీల్లోని ఆశావహులను టిక్కెట్ చింత వీడలేదు. రెండు జిల్లాల్లో 14 స్థానాలకుగాను ఏడు స్థానాలకు టిడిపి అభ్యర్థులను ప్రకటించింది. ఇక మిగిలిన ఏడు స్థానాల్లో ఎన్ని జనసేనకు కేటాయించారో, టిడిపి ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందో ఇప్పటికీ ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా పలు నియోజకవర్గాల్లో సీనియర్ నేతలకు సైతం టిక్కెట్ కోసం ఎదురీత తప్పడం లేదు. దెందులూరు మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌కు ఈసారి టిక్కెట్ వస్తుందా, లేదా అనే చర్చ పెద్దఎత్తున సాగుతోంది. ఆయన్ని మార్చి చింతమనేని కుమార్తెకు టిక్కెట్ ఇస్తారని పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. దీంతో తన కుటుంబం నుంచి ఎవరూ పోటీ చేయరని, వచ్చే ఎన్నికల్లోనూ తానే ఎంఎల్‌ఎ అభ్యర్థిగా పోటీ చేస్తానని చింతమనేని ప్రభాకర్ పదేపదే చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దెందులూరు నియోజకవర్గం నుంచి చింతమనేని రెండుసార్లు టిడిపి ఎంఎల్‌ఎగా గెలిచారు. గత టిడిపి ప్రభుత్వంలో విప్‌గా బాధ్యతలు నిర్వహించారు. వైసిపి ప్రభుత్వంలో అనేక కేసులను ఎదుర్కోవడంతోపాటు జైలుకి సైతం వెళ్లారు. దీంతో చింతమనేనికి టిక్కెట్ ఖాయమని ప్రచారం సాగుతుండగా, మరోపక్క ఈసారి ఆయనకు టిక్కెట్ రాదనే చర్చ సైతం ముమ్మరంగా సాగుతోంది. తొలివిడత జాబితాలో దెందులూరు అభ్యర్థిని ప్రకటించకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని టిడిపి నాయకులు, కార్యకర్తల్లో చర్చ నడుస్తోంది. చింతమనేనికి కాకుండా దెందులూరు స్థానం వేరొకరికి కేటాయిస్తే, సహకరించుకునే పరిస్థితి ఉంటుందా అనే అనుమానాలు నెలకొన్నాయి. టిడిపిలో మరో సీనియర్ నాయకుడు, ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుకు టిక్కెట్‌పై గడిగడి గండం అన్నట్లు పరిస్థితి తయారైంది. గతంలో ఉంగుటూరు ఎంఎల్‌ఎగా గన్ని గెలుపొందారు. అదేస్థానం నుంచి పోటీ చేయాలని ఎన్నికల ప్రచారం సైతం నిర్వహిస్తున్నారు. సాధారణంగా జిల్లా అధ్యక్షులు గన్నికి టిక్కెట్ విషయంలో పెద్దగా ఇబ్బంది లేదు. టిడిపి, జనసేన పొత్తుతో పరిస్థితి కొంత క్లిష్టంగా మారింది. జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు. గడిచిన ఐదేళ్లగా జనసేన తరపున విస్తృత ప్రచారం నిర్వహించడంతోపాటు అనేక కార్యక్రమాలు చేపట్టారు. పొత్తులో భాగంగా ఉంగుటూరు టిక్కెట్‌ను జనసేనకు కేటాయించినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో గన్నికి గండం తప్పదా అనే చర్చ నడుస్తోంది.

జనసేనలో కొనసాగుతున్న ఉత్కంఠ

నరసాపురం టిక్కెట్ అధికారికంగా ప్రకటించపోయినప్పటికీ పొత్తులో భాగంగా జనసేనకు కేటాయిస్తున్నట్లు దాదాపుగా స్పష్టత వచ్చింది. ఇక్కడ కొత్త సమస్య వచ్చి పడింది. ఇటీవలే వైసిపిని వీడిన మాజీ ఎంఎల్‌ఎ, మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు జనసేనలో చేరారు. గడిచిన పదేళ్లగా ఆ నియోజకవర్గంలో జనసేన ఇన్‌ఛార్జిగా బొమ్మిడి నాయకర్ ఉన్నారు. కొద్దిరోజుల క్రితం వరకూ నాయకర్‌కు టిక్కెట్ ఖాయమనే అభిప్రాయం అందరిలోనూ ఉంది. కొత్తపల్లి చేరికతో జనసేన నుంచి ఆయన పోటీ చేస్తారనే ప్రచారం నడుస్తోంది. జనసేన నుంచి వీరిద్దరిలో టిక్కెట్ ఎవరికి వస్తుందంటూ నియోజకవర్గంలో పెద్దఎత్తున బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. జనసేనకు రాష్ట్రవ్యాప్తంగా 24 టిక్కెట్లు కేటాయిస్తున్నట్లు స్పష్టత వచ్చేసింది. ఐదు నియోజకవర్గాలకు తప్ప మిగిలిన స్థానాల్లో అభ్యర్థులను జనసేన అధినాయకత్వం ప్రకటించలేదు. దీంతో నరసాపురం జనసేన నాయకుల్లో టిక్కెట్ టెన్షన్ నెలకొంది. తొలిజాబితాలోనే అభ్యర్థిని ప్రకటించి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదనే భావన జనసేన నాయకులు, కార్యకర్తల్లో నెలకొంది. తాడేపల్లిగూడెం స్థానంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. జనసేన నుంచి బొలిశెట్టి శ్రీనివాస్, టిడిపి నుంచి వలవల బాబ్జీ ఇక్కడ టిక్కెట్ ఆశిస్తున్నారు. తొలి జాబితాలో తాడేపల్లిగూడెం స్థానానికి సంబంధించి అభ్యర్థిని ప్రకటించలేదు. దీంతో టిక్కెట్ ఎవరికి దక్కుతుందనే టెన్షన్ టిడిపి, జనసేన శ్రేణుల్లో నెలకొంది. సీనియర్ నాయకులే అయినప్పటికీ టిక్కెట్ కోసం ఎదురుచూడాల్సి రావడంతో వారిలో చింత నెలకొంది. రెండో జాబితా ప్రకటన వెలువడే వరకూ ఈ టిక్కెట్ల టెన్షన్ కొనసాగనుంది.

10న ఏజెన్సీ బంద్‌కు సిపిఎం మద్దతు

8, 9 తేదీల్లో ఐటిడిఎ వద్ద ఆదివాసీ జనరక్షణ దీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏజెన్సీ ప్రాంత సమస్యల పరిష్కారానికి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల పదో తేదీన జరిగే ఏజెన్సీ బంద్‌ను జయప్రదం చేయాలని, ఈ బంద్‌కు మద్దతుగా సిపిఎం ఆధ్వర్యంలో 8, 9 తేదీల్లో కెఆర్‌పురం ఐటిడిఎ కార్యాలయం వద్ద జరిగే ఆదివాసీ జనరక్షణ దీక్షల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్పెషల్ డిఎస్‌సి విడుదల చేయాలని, జిఒ నెం.3పై ఆర్డినెన్స్ ఇవ్వాలని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ పునరావాస ప్యాకేజీ ఇవ్వాలని, అటవీ భూముల చట్ట సవరణను రద్దు చేయాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న ఏజెన్సీ ప్రాంత బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా ఏజెన్సీ గిరిజనులపట్ల సానుకూలంగా స్పందించాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

7న సదస్సు ప్రచార ఫ్లెక్సీల ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు



ఫ్లెక్సీని ఆవిష్కరించిన నేతలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల ఏడో తేదీ సదస్సు, కళా నీరాజనం, 55 మంది మహిళలకు అభినందన సభను జయప్రదం చేయాలని నిర్వాహక కమిటీ విజ్ఞప్తి చేసింది. స్థానిక అన్నే భవనంలో కార్యక్రమం ప్రచార ఫ్లెక్సీలను కమిటీ పెద్దలు మంగళవారం ఆవిష్కరించారు. హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అడుసుమిల్లి నిర్మల, గుడిపాటి నరసింహారావు, పి.ఆంజనేయులు, జి.శారద, ఎ.మోహిని, పి.కనకదుర్గ, ఎం.గంగాభవాని, కె.శ్రావణికుమారి, పి.సూర్యప్రకాష్‌రావు, కె.శ్రీనివాసరావు, టి.తులసి, టి.నాగయ్య, ఎం.సాయిసిద్ధార్థ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడుసుమిల్లి నిర్మల మాట్లాడుతూ ఈ నెల ఏడో తేదీన వైఎంహెచ్‌ఎ హాలులో మహిళా చైతన్య సదస్సు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం సంయుక్తంగా నిర్వహిస్తున్నాయన్నారు. మహిళల్లో చైతన్యం కలిగించడం కోసం కాలేజీ విద్యార్థులు, టీచర్లు, ఉద్యోగులు శ్రామిక మహిళలకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ రంగాల్లో మహిళల కోసం, సమాజాభివృద్ధి కోసం అభ్యుదయ భావాలతో కృషి చేస్తున్న ఎంపిక చేసిన 55 మంది మహిళలను ఈ సందర్భంగా సత్కరించనున్నట్లు తెలిపారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ సదస్సుకు ముఖ్యఅతిథిగా విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రం కమిటీ నిర్వాహకురాలు కె.స్వరూపరాణి ప్రధాన వక్తగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పారిశుధ్య పనుల్లో తేడా వస్తే సహించేది లేదు

సమీక్షా సమావేశంలో ఆర్‌డిఒ భవానీ శంకరి

ప్రజాశక్తి - ముసునూరు


బ్రిడ్జి పనులు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

తిరునాళ్ల నాలుగు రోజులు పారిశుధ్య పనుల్లో ఎలాంటి తేడా వచ్చినా సహించేది లేదని పంచాయతీ కార్యదర్శికి నూజివీడు ఆర్‌డిఒ వై.భవానీ శంకరీ తెలియజేశారు. మంగళవారం మండలంలోని బలివే గ్రామంలో శ్రీరామలింగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం ఈనెల 7, 8, 9, 10 తేదీలలో జరుగుతున్న సందర్భంగా అన్ని శాఖలాధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలని ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆర్‌డిఒ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత రెండు, మూడు సంవత్సరాలతో పోల్చుకుంటే ఈ ఏడాది కళ్యాణ తిరునాళ్ల ఉత్సవాల సందర్భంగా సుమారు రెండు లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం వుందని పారిశుధ్యం, తాగునీరు, క్యూలైన్లు ఏర్పాట్లు, ప్రతి సమాన్య భక్తుడికి కూడా దర్శనం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌అండ్‌బి డిఇతో మాట్లాడుతూ నూజివీడు నుంచి వేల్పుచర్ల వరకు సుమారు 22 కిలో మీటర్లు వరకు మొత్తం గోతులమయంగా వుందని, కనీసం ఆ గోతులన్నా పూడ్చాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ నాలుగు రోజులు సీసీ కేమెరా పర్యవేక్షణ వుండాలన్నారు. నూజివీడు డిఎస్‌పి జి.లక్ష్మయ్యతో మాట్లాడుతూ ట్రాఫిక్, శాంతి భద్రతలు, దొంగతనాలు లేకుండా సీసీ కమెరాల కనుసన్నల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు. అదేవిధంగా ఆర్‌టిసి వారు ఏలూరు డిపో నుంచి 55 బస్సులు, నూజివీడు డిపో నుంచి 25 బస్సులు నడపడం జరుగుతుందన్నారు. తమ్మిలేరులోకి రిజర్వాయర్ నీళ్ల ప్రస్తుతం 100 కూసెక్కులు వస్తాయని ఎఇ తెలపడంతో, 150-200 క్యూసెక్కుల నీళ్ల తీసుకురావాలని ఆదేశించారు. వైద్య సిబ్బందితో మాట్లాడుతూ రెండు, మూడు షిఫ్ట్‌ల ద్వారా 24 గంటలూ ప్రజా సేవకు అందుబాటులో వుండాలని, రెండు అంబులెన్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఉచిత దర్శనం, సర్వ దర్శనం, రూ.100, 200, 300లు టిక్కెట్లు క్యూలైన్స్, తమ్మిలేరు జలాశయం వద్ద జల్లు స్నానాల ఏర్పాట్లు, తమ్మిలేరుపై జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రావు ప్రవీణా సుధాకర్, డిఎస్‌పి జి.లక్ష్మయ్య, నూజివీడు సిఐ రామకృష్ణ, ఎస్‌ఐ పి.వాసు, తహశీల్దార్ జవహర్ బాజీ, ఎంపిడిఒ చాగంటి పద్మావతిదేవి, వైద్యశాఖాధికారులు, రెవెన్యూ, ఎంపిడిఒ, పోలీస్‌శాఖ, దేవదాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

పట్టిసీమ శివరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ అద్దయ్య

ప్రజాశక్తి - పోలవరం


కాలినడక మార్గాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ, డిఎస్‌పి, అధికారులు

పట్టిసీమ మహా శివరాత్రి ఉత్సవాలకు వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలని ఉత్సవ కమిటీ ఛైర్మన్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ అద్దయ్య అన్నారు. మంగళవారం పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది దాదాపు 600 మంది విధులకు హాజరవుతారని, నదిలో ఎటువంటి ప్రమాదం జరగకుండా సుమారు 200 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామని తెలిపారు. యాత్రికులు ఫెర్రీ రేవు నుండి ఆలయానికి వెళ్లి వచ్చేవరకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. డిఎస్‌పి సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యాన మూడు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని, నదిలో ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బోట్లతో పర్యవేక్షణ, నది తీరంలో ఇసుక తిన్నెల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా వాచ్ టవర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పారిశుధ్య నిర్వహణకు పంచాయతీ సిబ్బందిని నియమించామని డిపిఒ తూతిక విశ్వనాథ్ తెలిపారు. అనంతరం గోదావరి నదిలో నడకదారికి ఏర్పాటు చేసిన పంటులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఇఒ సంగమేశ్వరశర్మ, ఎంపిడిఒ జి.శ్రీను, తహశీల్దార్ ప్రసాద్, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ఎస్‌ఐ ఎస్-ఎస్.పవన్‌కుమార్, సర్పంచి సబ్బారపు శ్రీరామ్మూర్తి, పట్టిసీమ సెక్రటరీ తాతి విజయకుమారి, హుకుంపేట జమిందారు హోతా వీరభద్రరావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో గత తుఫాను కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీగా రూ.72.44 లక్షలు మంజూరయ్యాయని వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు పి.ఉషా రాజకుమారి తెలిపారు. దీనిలో భాగంగా భీమడోలు మండలంలో తుఫాను కారణంగా 3,398 రైతులకు చెందిన 212 హెక్టార్ల విస్తీర్ణంలో పంట నష్టం జరగగా నష్టపరిహారంగా రూ.36.20 లక్షలు మంజూరయ్యాయన్నారు. నిడమర్రు మండలంలో 28 మంది రైతులకు చెందిన 13.91 హెక్టార్ల విస్తీర్ణంలో పంట నష్టం జరగగా రూ.2.37 లక్షలు నష్ట పరిహారంగా మంజూరయ్యాయన్నారు. ఉంగుటూరు మండలంలో 229 మంది రైతులకు చెందిన 128 హెక్టార్లు విస్తీర్ణంలో పంట నష్టం జరగగా, నష్ట పరిహారంగా రూ.19.24 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ద్వారకాతిరుమల మండలంలో 186 మంది రైతులకు చెందిన 84.87 హెక్టార్ల విస్తీర్ణంలో పంటనష్టం జరగగా నష్టపరిహారంగా రూ.14.16 లక్షలు మంజూరయ్యాయని తెలియజేశారు.

గురుకుల విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండలం నాగిరెడ్డి గూడెం ఎపి గురుకుల విద్యాలయంలో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బ్రహ్మణేశ్వరమ్మ ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం 5, 6, 7, 8 ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఏలూరు జిల్లాలో అప్పలరాజు గూడెం, నాగిరెడ్డిగూడెం, ముసునూరు బాలికలకు 5, 6, 7, 8వ తరగతులలో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష ఈనెల 25వ తేదీన జరుగుతుందని తెలిపారు. వివరాల కోసం 8712625031ను సంప్రదించాలని కోరారు.


ఇంగ్లీష్ పరీక్షకు 133 మంది హాజరు

ప్రజాశక్తి - కలిదిండి

ఇంటర్ ద్వితీయ సంవత్సర ఇంగ్లీష్ పరీక్షకు 133 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నంబూరి గోపాల కృష్ణంరాజు తెలిపారు. కోరుకొల్లు, కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు 142 మంది విద్యార్థులకు గాను 133 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విఆర్‌ఎకు గాయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్



చికిత్స పొందుతున్న విఆర్‌ఎ

మండలంలోని గురవాయిగూడెం దగ్గర ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో విఆర్‌ఎ కొదమ సుబ్బారావు(46)కి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం జంగారెడ్డిగూడెం విఆర్‌ఎ సుబ్బారావు పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో గురవాయిగూడెం దగ్గరకు చేరుకోగా అటుగా కామరపుకోట నుంచి జంగారెడ్డిగూడెం వైపు వెళుతున్న మద్యం సేవించి ఉన్న వ్యక్తి విఆర్‌ఎని ద్విచక్ర వాహనంతో బలంగా ఢీకొట్టగా సుబ్బారావుకి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం తహశీల్దార్ తన సిబ్బందిని వెంటనే అప్రమత్తం చేసి 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. తలకు, చేతులకు, కాళ్లకు బలమైన గాయాలు కావడంతో 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జంగారెడ్డిగూడెం తహశీల్దార్ జిల్లా వైద్యాధికారులతో సుబ్బారావుకి మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు.

సోషలిస్టు నేతల్లో అగ్రగణ్యుడు స్టాలిన్

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


స్టాలిన్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

సోషలిస్టు విప్లవ నేతల్లో అగ్రగణ్యుడు స్టాలిన్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కొనియాడారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన స్టాలిన్ వర్థంతి సభకు ఆ పార్టీ నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రష్యాలో సోషలిస్టు విప్లవం జయప్రదం కావడానికి లెనిన్‌తోపాటు స్టాలిన్ పాత్ర ఎంతో ప్రముఖమైందని గుర్తు చేశారు. స్టాలిన్ గొప్ప మానవతావాదని అన్నారు. రష్యాలో సోషలిస్టు విప్లవం జయప్రదమైన తర్వాతే మన దేశంతో సహా అనేక వలస దేశాల్లో స్వాతంత్ర్య పోరాటాలు తీవ్రతరమయ్యాయని గుర్తు చేశారు. ఆర్యన్ సిద్ధాంతంతో విర్రవీగిన ఫాసిస్టు పాలకుడు హిట్లర్‌ను చివరకు బంకర్లో దాక్కొని చనిపోయేలా చేసింది స్టాలిన్ అని తెలిపారు. మన దేశంలోనూ ప్రస్తుతం నాజీ హిట్లర్ ఫాసిజం పద్ధతిలో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి తన మతోన్మాద భావజాలం మాత్రమే దేశాన్ని పరిపాలించాలని కోరుకుంటుందన్నారు. దీన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పి.ఆదిశేషు, వివిఎన్.ప్రసాద్, ఎస్.సత్యనారాయణ, మీసాల సత్యం, జి.కోటేశ్వరరావు, ఎ.జాన్‌బాబు, బి.త్రినాథ్, కె.లెనిన్, పి.దుర్గాప్రసాద్, వి.ఠాగూర్‌రాజా, రుక్మానందరావు పాల్గొన్నారు.

ములకలపల్లిలో సీసీ రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి


సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న డిఎన్‌ఆర్

మండలంలోని ములకలపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను మంగళవారం ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో పాల్గొని డిఎన్‌ఆర్ మాట్లాడుతూ పేదలకు, పెత్తందారులు మధ్య జరుగుతున్న ఈ యుద్ధంలో జగన్ వెంట నడవడానికి మేము సిద్ధం.. మరి మీరు సిద్ధమా అనగా పెద్దఎత్తున గ్రామస్తులు జగన్ వెంట నడవడానికి మేమంతా సిద్ధమన్నారు. ప్రజలంతా మరోసారి జగనన్నను ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపి చొప్పర్ల సునీత, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు శీలం రామకృష్ణ, గ్రామ సర్పంచి ఎన్.కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, రాష్ట్ర బిసి నాయకులు కోమటి విష్ణు, ఈడే వెంకటేశ్వరరావు, ఎఎంసి వైస్ ఛైర్మన్ బత్తిన కిషోర్, మాజీ ఎఎంసి ఛైర్మన్ శేషుబాబు పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో మద్యం దుకాణాలు బంద్

ఏలూరు: పట్టిసీమలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా పోలవరం మండలం పోలవరం, గూటాల, పట్టిసీమ గ్రామాల్లో ఈ నెల 7వ తేదీ రాత్రి 10 గంటల నుంచి 9వ తేదీ రాత్రి 10 గంటల వరకు మద్యం దుకాణాలు మూసి ఉంచాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆయా గ్రామాల్లో శివరాత్రి సజావుగా శాంతియుతంగా నిర్వహించే నేపథ్యంలో ఆ ప్రాంతంలో ఉన్న మూడు ప్రభుత్వ రిటైల్ అవుట్‌లెట్స్, మూడు కల్లు దుకాణాలను మూసి ఉంచాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిర్బంధాలు తగవు

సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు

ప్రజాశక్తి - భీమడోలు


లింగరాజుని నిర్బంధించిన పోలీసులు


గ్రామ సేవకుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన చలో విజయవాడ ధర్నా కార్యక్రమానికి వెళ్లనీయకుండా పోలీసులు సిఐటియు నాయకులకు నోటీసులు జారీచేయటం, నిర్బంధించడం తగదని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి ప్రసాద్ నిరసన వ్యక్తపరిచారు. దీనిలో భాగంగా భీమడోలులో లింగరాజుకు నోటీసులు జారీ చేసిన పోలీసులు నిడమర్రులో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారాపల్లి రమణరావుకు సైతం నోటీసులు జారీ చేశారని లింగరాజు తెలిపారు. ఇదే క్రమంలో జీలుగుమిల్లిలో గ్రామ సేవకుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మాజీ, చంద్రశేఖర్‌లను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. ప్రభుత్వం దీనిపై స్పందించి నిర్బంధాలను, ఇతర కార్యక్రమాలను మానుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులు ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ

లంక గ్రామాల్లో వైఎస్ఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని దెందులూరు ఎంఎల్‌ఎ కోటారు అబ్బయ్యచౌదరి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం కొంపలరావు పాలెంలోని ఎంఎల్‌ఎ కార్యాలయంలో ఏలూరు రూరల్ మండలంలోని గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక, కొక్కిరాయిలంక గ్రామాలకు చెందిన వైసిపి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌ఎ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా గ్రామాలలో జరిగిన అభివృద్ధిని, ప్రజలకు అందించిన సంక్షేమాన్ని ప్రతి గడపకూ వెళ్లి వివరింప చేయాలన్నారు. మంచి చేసిన మన జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, వైసిపికి మద్దతు ఇచ్చేలా ప్రజలకు తెలియజేయాలన్నారు. రాబోయే రోజుల్లో బూత్ కమిటీలు పగడ్బందీగా పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఫండ్ అందజేస్తున్న వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయరాజు

సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని చింతలపూడి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి కంభం విజయరాజు అన్నారు. చింతలపూడిలోని గ్రామానికి చెందిన కె.జ్యోతికి సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి విడుదలైన రూ.70 వేల చెక్కును కంభం విజయ రాజు, చింతలపూడి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జగ్గవరపు జానకి రెడ్డి, జెడ్‌పిటిసి నీరజ జ్యోతికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జ్యోతి అనారోగ్యానికి గురికావడంతో ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. ఈమేరకు ప్రభుత్వం ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.70 వేలు రిలీజ్ చేయడంతో మంగళవారం చెక్కును ఆమెకు అందజేయడం జరిగిందని తెలిపారు. తనకు అండగా నిలిచిన సిఎం జగన్మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని జ్యోతి తెలిపింది. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పిఇఎస్ఎ చట్టం అమలు చేయాలి


ప్రజాశక్తి - చింతలపూడి

పిఇఎస్ఎ చట్టం పూర్తిస్థాయిలో అమలు చేసి షెడ్యూల్ ఏరియాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉమ్మడి కార్యాచరణ ప్రకటించి, ఏజెన్సీ ఏరియాలోని గిరిజనులు స్వయం సమృద్ధిగా అభివృద్ధి అయ్యేలా చూడాలని కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ అధికారులను కోరినట్లు ఎంపిపి రాంబాబు తెలిపారు. భారత ప్రభుత్వం ద్వారా రాంచీలో ఈనెల 4, 5 తేదీల్లో జరుగుతున్న 2వ రీజినల్ కాన్ఫరెన్స్‌కు చింతలపూడి మండల ఎంపిపి డాక్టర్ బి.రాంబాబు హాజరైనట్లు తెలిపారు. పిఇఎస్ఎ(పంచాయతీ ఎక్స్‌టెన్షన్ టూ షెడ్యూల్డ్ ఏరియా) 2వ రీజినల్ కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పిఇఎస్ఎ చట్టం అమలు అయ్యేలా పంచాయతీ రాజ్ శాఖ ద్వారా ప్రత్యేక కార్యక్రమం చేయాలని, అటవీ హక్కు చట్టం, ఏజెన్సీ ఏరియాలో మైనింగ్, చిన్న ప్రాజెక్ట్స్‌కి పిఇఎస్ఎ చట్టం కింద గ్రామసభ ఆమోదం ద్వారా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు.

'అందరం కలిసి పనిచేద్దాం'

ప్రజాశక్తి - చింతలపూడి

అందరం కలిసి పని చేద్దామని, టిడిపి, జనసేన అధికారంలోకి వస్తే కష్టపడే వ్యక్తులకు టిడిపితో పాటు నామినేటె పదవులు సమానంగా నిర్వహిస్తామని మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి, గంటా మురళీ రామకృష్ణ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేక ఈశ్వరయ్య అన్నారు. మండలంలోని ప్రగడవరం గ్రామంలో ఏర్పాటు చేసిన టిడిపి, జనసేన ఉమ్మడి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఇరు పార్టీ నాయకులు కార్యాచరణతో ఎలా ముందుకెళ్లాలో చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా జగ్గవరపు ముత్తారెడ్డి మాట్లాడుతూ ఏ కార్యక్రమం జరిగినా ఉమ్మడిగా అందరం కలిసి వెళ్తామన్నారు. దీనికి జనసేన నాయకులంతా హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి చింతలపూడి జనసేన మండల అధ్యక్షులు చీదరాల మధుబాబు, కామవరపుకోట మండల అధ్యక్షులు ఎస్‌కె.వలి, జంగారెడ్డిగూడెం టౌన్ అధ్యక్షులు పీరు, ప్రగడవరం గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి చిన్నబాబు, ఎక్స్ ఎంపిటిసి కనమత రెడ్డి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో నేతలు

తారు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - చింతలపూడి

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పరిపాలన కొనసాగిస్తున్న వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. లింగపాలెం మండలం యడవల్లి గ్రామంలో యడవల్లి నుంచి ఎర్రవారిగూడెం వెళ్లేందుకు రూ.60 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బ్రిడ్జి, తారు రోడ్డు నిర్మాణ పనులకు చింతలపూడి నియోజకవర్గ వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి కంభం విజయ రాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జగ్గవరపు జానకి రెడ్డి, లింగపాలెం వైసిపి పార్టీ మండల అధ్యక్షుడు కొఠారి మోహన్ రావు, చింతలపూడి జెడ్‌పిటిసి నీరజ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లికి చెందిన కావూరి నాగరాజు(40) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. నాగరాజు స్థానిక హోటల్‌లో సప్లయర్‌గా పనిచేస్తున్నాడు. మద్యం అధికంగా సేవించడం కారణంగా నాగరాజు మృతి చెందినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న అమరావతి మాజీ బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి తన తండ్రి డాక్టర్ అంబుల మనోజ్ ద్వారా మృతుని కుటుంబానికి రూ.5 వేలు నగదును అందజేశారు. అలాగే టిడిపి నేత కె.వినోద్ నాగరాజు పార్థివ దేహాన్ని సందర్శించి అంజలి ఘటించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు దహన ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు నగదు అందజేశారు.

నేరాలు - ఘోరాలు

కలుపు మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

కలుపు మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు మంగళవారం విలేఖరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మక్కినవారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని సంగారావుపేట గ్రామానికి చెందిన భాగి మంగరాజు వ్యసనాలకు బానిసై, చేసిన అప్పులు తీర్చలేక ఈనెల 3వ తేదీన కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య మారేశ్వరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ మద్యం సీసాలను నూజివీడు ఎస్ఇబి సిబ్బంది మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు ఎస్ఇబి ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్ఇబి అడిషనల్ ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు ఆదేశం మేరకు నూజివీడు ఎస్ఇబి స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహిస్తుండగా కృష్ణారావు పాలెం వద్ద ముసునూరుకు చెందిన అనగాని కృష్ణారావు(38) మోటర్ బైక్‌పై తెలంగాణకు చెందిన మద్యం సీసాలను తరలిస్తుండగా పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి ఒఎబి 48, మెన్షన్ హౌస్ 24, కింగ్ ఫిషర్ 12 మద్యం సీసాలను స్వాధీన పరచుకున్నట్లు ఆయన తెలిపారు. అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలియజేశారు.

వీధి కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని గుండుగూడెం గ్రామంలో వీధి కుక్కలు గొర్రెల దొడ్డుపై విరుచుకు పడి 12 గొర్రెలను హతమార్చాయి. వివరాల్లోకి వెళితే గుండుగూడెం గ్రామంలో సోడే లక్ష్మయ్య గొర్రెలు కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. అతని వద్ద సుమారుగా గొర్రెలు, మేకలు కలిపి 70 ఉన్నాయి. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో ఆ గొర్రెల కాపరి లక్ష్మయ్య ఇంటి వద్ద ఆహారం తింటున్న సమయంలో సుమారుగా 8 వీధి కుక్కలు ఆ గొర్రెల దొడ్డిపై విరుచుకు పడి 12 గొర్రెలను హత మార్చాయి. అది తెలుసుకున్న లక్ష్మయ్య, ఆ ఊరి గ్రామస్తులు వీధి కుక్కలను తరిమికొట్టగా అందులో ఒక రెండు గొర్రెలు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయి. గొర్రెల కాపరి లక్ష్మయ్యకి సుమారుగా రూ.లక్ష వరకు నష్టం వాటిల్లడంతో ప్రభుత్వం నుంచి సహాయం అందించమని వేడుకుంటున్నాడు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందజేత

ప్రజాశక్తి - భీమడోలు


వివిధ శాఖల సమన్వయం, సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కలను వైసిపి ప్రభుత్వం సాకారం చేసిందని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో మంగళవారం సాయంత్రం నవరత్నాలు పేదలకు ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇళ్ల స్థలాలు కేటాయించిన వారికి ఇంటి స్థలం హక్కుల పత్రాన్ని ఉచితంగా అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అధ్యక్షులు కనమాల రామయ్య అధ్యక్షత వహించగా, ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నవరత్నాల పథకంలో భాగంగా ఇళ్ల స్థలాల పంపిణీ కోసం రూ.17 కోట్ల వ్యయంతో 39 ఎకరాల భూసేకరణ జరిగిందన్నారు. దీనిలో భాగంగా 3,040 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పంపిణీ, స్థలాల గుర్తింపు కార్యక్రమాలు పూర్తయ్యాయన్నారు. వీరిలో 2,543 మంది ఇంటి స్థలాల హక్కుల పత్రాల కోసం దరఖాస్తు చేసుకోగా వీరిలో అన్ని అర్హతలు గల 2,136 మంది లబ్ధిదారులకు రూపాయల వ్యయంతో ఉచితంగా రిజిస్టర్ చేసిన హక్కు పత్రాలను అందజేశామన్నారు. మిగిలిన వారిలో వారికి కేటాయించిన స్థలాల్లో తలెత్తిన సమస్యలు పరిష్కరించి వారికి సైతం త్వరలోనే అందజేస్తామని వివరించారు. గతంలో డిఫారం రూపంలో ఇళ్ల స్థలాలుగా పట్టాలను అందజేసే వారన్నారు. వీటిపై సర్వహక్కులు వారికి అందేందుకు పలు ఇబ్బందులు ఏర్పడేవన్నారు. కానీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఈ ప్రక్రియ అంతనూ సరళీకృతం చేసిందన్నారు. లబ్ధిదారునికి అన్ని సౌకర్యాల కల్పనతో పాటు విద్యుత్, నీరు, ఇతర సౌకర్యాలను ఉచితంగా కల్పించిందన్నారు. ఇంటి నిర్మాణానికి పూర్తిస్థాయి రాయితీతో కూడిన రుణాలను అందజేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యురాలు తమ్మనగుంట భవాని, భీమడోలు సర్పంచ్ ఛాంబర్ అధ్యక్షులు పి.సునీత మాన్సింగ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఐ.నీలిమ, వైసిపి ప్రముఖులు రావిపాటి సత్య శ్రీనివాస్, రామకుర్తి నాగేశ్వరరావు, ముళ్ళగిరి జాన్సన్ పాల్గొన్నారు.



భీమడోలు: హక్కు పత్రాలు లబ్ధిదారులకు అందజేస్తున్న ఎంఎల్‌ఎ

జంగారెడ్డిగూడెం టౌన్ : వైఎస్ జగన్మోహన్ రెడ్డి శాశ్వత భూ హక్కు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడమనేది చాలా గొప్ప విషయమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం ఉదయం నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల కింద ఇచ్చిన నివాస స్థలాల దస్తావేజుల పంపిణీ కార్యక్రమం 1, 2వ సచివాలయాలకు సంబంధించి కేశనపల్లి వారి వీధి 2వ సచివాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 1, 2వ సచివాలయం పరిధిలోని లబ్ధిదారులు 230 మందికి దస్తావేజులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ నాయకులు జెట్టి గురునాధరావు, మేడవరపు విద్యా సాగర్, చిప్పాడ వెంకన్న, ఎస్‌కె.అమీర, వైసిపి పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుత రామయ్య, పాల్గొన్నారు.

ఉంగుటూరు: జగనన్న ఇళ్ల పట్టాలకు శాశ్వత హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేసి పక్కా డాక్యుమెంట్లు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే చెల్లిందని, ఇది దేశానికే ఆదర్శనీయమని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. ఉంగుటూరు పాతూరి కళ్యాణ మండపంలో మంగళవారం మండల వాప్తంగా 1,671 మంది లబ్ధిదారులకు శాశ్వత రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సొంతింటి కల సాకారంతో పాటు శాశ్వత రిజిస్ట్రేషన్ పట్టాలు ఇవ్వడంతో అక్కా చెల్లెమ్మలకు ఆస్థి సమకూర్చామన్నారు. వినూత్న సంక్షేమ పథకాలను అందిస్తున్న వైసిపిను ఆదరించాలని ఆయన అభ్యర్థించారు. మండలంలో 27 పంచాయతీల నుంచి లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో రావడంతో సమావేశ మందిరం కిక్కిరిసింది. తహశీల్దారు శివయ్య, పార్టీ మండల కన్వీనర్ మరడ మంగారావు, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, మాజీ ఎఎంసి ఛైర్మన్ మరడ రమావతి, నాయకులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో పట్టాలు అందుకుంటున్న లబ్ధిదారులు

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - కుక్కునూరు

క్రీడాకారుల్లో మానసిక ఉల్లాసం పెంపొందించడానికి సూపర్ సిక్స్ మెగా టోర్నమెంట్ ఆటల పోటీలను మంగళవారం ప్రారంభించారు. మండలంలోని వైసిపి ఆధ్వర్యంలో చర్చి హాస్టల్ మైదానంలో నిర్వహించిన పోటీలను కుక్కునూరు సర్పంచి రావు మీనా వినోద్, పార్టీ మండల అధ్యక్షులు కుచర్లపాటి నర్సింహారాజు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ముందుగా చర్చి హాస్టల్ ప్రాంగణంలో ఉన్న క్రీడాకారులతో గౌరవ వందనం స్వీకరించి అనంతరం వారితో కలిసి ఉల్లాసంగా ఆటలపోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ క్రీడలు ఆడడం వల్ల శారీరక, మానసిక ధృడత్వం కలుగుతుందన్నారు. అలాగే ఈ క్రీడలు ఆడటం వల్ల శారీరక ధృడత్వం పెరిగి క్రీడా నైపుణ్యం, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగవుతాయని సూచించారు. ఆటల పోటీలు అంటేనే ఒకరు గెలుపు, ఒకరు ఓటమి అని, ఎవరూ కూడా వ్యక్తిగతంగా తీసుకొని గొడవలు పడకుండా ఫ్రెండ్లీగా మంచి వాతావరణం కలిగి ఉండాలని తెలిపారు. ఓటమి చెందిన వారు మళ్లీ నిర్వహించే ఆటలపోటీలలో ఎలా గెలవాలి అనే ప్రణాళిక మాత్రమే సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఇరు జట్ల క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియచేసి మేనేజ్మెంట్ వారికి కూడా ప్రోత్సాహం అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ మాధిరాజు వెంకన్నబాబు, మండల నాయకులు రావు వినోద్, రాయి సత్యనారాయణ, మల్లేలా చంటి నాయుడు, చేబ్రోలు ఫరిద్, సూర్ల రాము, అయిత కోటేశ్వరరావు, వేల్పుల రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచి

పెండింగు వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పెండింగులో ఉన్న ఆయా, స్వీపర్స్ పాత వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు డిమాండ్ చేశారు. అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ప్రభుత్వ పాఠశాలల ఆయా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలు, స్వీపర్లు గత తొమ్మిది సంవత్సరాల నుంచి పాఠశాల ఆవరణ, టాయిలెట్స్ శుభ్రపరుస్తున్నారన్నారు. వీరికి కేవలం రూ.6 వేలు వేతనం మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 100 మంది విద్యార్థులు ఉండే పాఠశాలలో 300 మంది విద్యార్థులు ఉండడంతో ఆయాలపై పని ఒత్తిడి భారం పడిందన్నారు. ఏదైనా అనారోగ్యం వస్తే కనీసం సెలవు కూడా ఉండటం లేదని వాపోయారు. ప్రతి 100 మంది విద్యార్థులకు ఒక ఆయాని నియమించాలని, నెలలో ఒక్కసారి మెడికల్ లీవ్ మంజూరు చేయాలని, 108 జిఒను అనుసరించి రూ.11,500లు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మద్దాల దుర్గ, డేగల భవాని, చంద్ర నాగలక్ష్మి, గాలంకి కుమారి, ఎ.వెంకాయమ్మ, జి.రాధ పాల్గొన్నారు.

'జయహో బిసి'కి తరలిన నేతలు

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి ఆవిర్భావం నుంచి బిసిలు టిడిపి వెంట నడుస్తూ పార్టీకి అండగా నిలుస్తున్నారని జిల్లా నాయీబ్రాహ్మణ సాధికారిక కన్వీనర్ కొప్పెర్ల నాగరాజు అన్నారు. మంగళగిరిలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో జరుగుతున్న జయహో బిసి భారీ బహిరంగ సభకు చింతలపూడి నియోజకవర్గం నుంచి బిసి నేతలు మంగళవారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే ఈసభలో బిసి డిక్లరేషన్‌ను టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటిస్తున్న సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కొనకల్ల వీర్రాజు, నారా లోకేష్ యువజన ఫౌండేషన్ కార్యదర్శి చక్రపు మారేశ్వరరావు, మాజీ వార్డ్ మెంబర్ రాచకొండ రాంబాబు, కాగిత రాజేష్ పాల్గొన్నారు.

ముసునూరు: టిడిపి ఎల్లప్పుడు బిసిలకు అండగా వుంటుందని రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు అన్నారు. మంగళవారం ముసునూరు మండలంలోని 16 గ్రామాల నుంచి నాలుగు బస్సుల్లో సుమారు 500 మంది బిసిలు మంగళగిరిలోని ఆచార్య నాగర్జున యూనివర్శిటీ ఎదురుగా వున్న ఖాళీ స్థలంలో మాజీ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిర్వహిస్తున్న బిసి సదస్సుకు హాజరౌతున్నట్లు తెలిపారు. రాష్ట్ర బిసి నాయకులు మానురాజ్ సురేష్, గారపాటి నరిసింహారావు పాల్గొన్నారు.

కలిదిండి : మంగళగిరిలో జరిగే జయహో బిసి సభకు రాష్ట్ర టిడిపి బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు అధ్వర్యంలో మండలం నుంచి బిసి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. తొలుత ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, మాజీ జెడ్‌పిటిసి నున్న రమాదేవి జెండా ఊపి కార్ల ర్యాలీని ప్రారంభించారు. చంద్రబాబు నాయుడు 34 శాతంతో బిసిలను రాజకీయంగా ప్రోత్సహిస్తే, బిసి ఓట్లతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రిజర్వేషన్లు తగ్గించడంతో స్థానిక సంస్థల్లో 16,800 పదవులను బిసిలు కోల్పోయారన్నారు. జగన్ హయాంలో బిసిలకు అన్యాయం జరిగిందన్నారు. చంద్రబాబుతోనే బిసిలకు అభివృద్ధి సాధ్యమని, బిసిలకు పెద్దపీట వేసే టిడిపిని గెలిపించాలని కోరారు. వెంకటాపురం సర్పంచి గూడవల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపిటిసి లంకా రత్నారావు, నాయకులు వాకాని కోటేశ్వరరావు, పరసా మురళీ, నున్న అనిల్, గంగుల పైడియ్య, కొల్లాటి గోపాలం, తిరుమలశెట్టి ఈశ్వర పరశురాముడు, కొక్కిగడ్డ అంజి పాల్గొన్నారు.

కొత్త బస్టాండ్ ఆవరణలో దారుణం

దొంగతనం చేశాడనే నెపంతో వ్యక్తిపై పెట్రోల్ పోసి నిప్పు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరులోని కొత్త బస్టాండ్ ఆవరణలో దారుణం చోటుచేసుకుంది. దొంగతనం చేశాడనే నెపంతో కట్టేసి.. కాళ్లపై పెట్రోలు పోసి నిప్పంటించారు. వివరాల్లోకి వెళితే ఏలూరు శుభం వారి వీధి, గిలకల గేటు ప్రాంతానికి చెందిన క్రిముజ్జి బిర్లా గోపి కూలీ పనులు చేస్తూ జీవిస్తుంటాడు. సోమవారం రాత్రి 12 గంటల 30 నిమిషాలకు ఏలూరు కొత్త బస్టాండ్ సమీపంలో బిర్యాని కొనుక్కొని తింటూ ఉండగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి తనకు కూడా బిర్యాని పెట్టమని అడిగాడు. ఇద్దరూ కలిసి బిర్యాని తిన్న తర్వాత ఆ గుర్తు తెలియని వ్యక్తి ఎదురుగా ఉన్న ముఠా పని చేసే వ్యక్తిని చూపించి అతని వద్ద నా ఫోను ఉందని ఆ ఫోను తీసుకురమ్మని చెప్పగా గోపి ముఠా వ్యక్తి దగ్గరకు వెళ్లి అతని జేబులోని ఫోను తీసి ఇతనికి ఇవ్వగానే అతను పారిపోయాడు. వెంటనే ఆ ముఠా పని చేసే వ్యక్తి గోపిని పట్టుకుని పలువురు ముఠా సభ్యులతో కలిసి బస్సుకు కట్టివేసి దాడి చేశారు. అంతట ఆగకుండా అతని కాళ్లపై పెట్రోల్ పోసి నిప్పు అంటించారు. అనంతరం అతని ఫోన్ లాక్కొని వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వారు అక్కడి నుండి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఆటోలో జిల్లా కేంద్ర సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కేసును ఏలూరు మూడో పట్టణ పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందరూ కలిసికట్టుగా పని చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

అందరం కలిసికట్టుగా పనిచేసి, 2024లో ఫ్యాన్ గుర్తుకి ఓటు వేసి గెలిపించాలని, చింతలపూడి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి కంభం విజయరాజు అన్నారు. చింతలపూడి మండలంలోని చింతపల్లి సర్పంచి తాండ్ర రామకృష్ణ ఆధ్వర్యంలో వైసిపి కార్యకర్తలను, నాయకులను, ఆయన పరిచయం చేశారు. ముందుగా రాజశేఖర్ రెడ్డి విగ్రహనికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరం కలసి పనిచేద్దామని, ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి గెలిపించుకుందామని అన్నారు. సంక్షేమ పథకాలకు మద్దతుగా ఉందామన్నారు. వైసిపి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని, ప్రతి ఒక్కరూ ఓటు వేసి జగన్మోహన్ రెడ్డికి మద్దతుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జానకిరెడ్డి, జడ్‌పిటిసి నీరజ, టౌన్ అధ్యక్షులు కొప్పుల నాగు, అభిమానులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజనుల భూమి ఆన్‌లైన్ రికార్డుల నుంచి తహశీల్దార్ సంతకాలు తొలగించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని, డిజిటల్ సంతకం వెంటనే ఇవ్వాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఎఐకెఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్ముల సురేష్ డిమాండ్ చేశారు. ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో మండలంలో వెలుతూరువారి గూడెం గ్రామ గిరిజనులు మంగళవారం మండల కేంద్రమైన బుట్టాయగూడెం తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ 2007లో 1/70 భూమి తీసుకొని అసైన్మెంట్ చేసి 74 మంది లబ్ధిదారులుగా పట్టాలు ఇచ్చారన్నారు. ఆన్‌లైన్ రికార్డు చేసుకుని వాటి ద్వారా బ్యాంకు లోన్లు కూడా పొంది ఉన్నారన్నారు. గత వారం రోజుల నుంచి ఆన్‌లైన్ రికార్డులలో తహశీల్దారు డిజిటల్ సంతకం కనిపించకుండా పోయిందని, రెవెన్యూ వారి నిర్లక్ష్యం వల్ల గిరిజన ప్రజలకు ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఉందని వారు అన్నారు. రెవెన్యూ రికార్డుల్లో డిజిటల్ సంతకం తక్షణమే ఇవ్వకపోతే తహశీల్దార్ కార్యాలయం నుంచి మేము కదలమని గిరిజనులందరూ బైఠాయించారు. క్యాంపులో ఉన్న తహశీల్దార్ విషయం తెలుసుకొని అక్కడికి వచ్చి రెండు రోజుల్లో ఆన్‌లైన్ రికార్డుల్లో తహశీల్దార్ సంతకం ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గిరిజన రైతులు ధర్నాని విరమించి తహశీల్దారు వెంకటేశ్వర్లుకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వెట్టి సుబ్బన్న, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P. No. 02/2017 in O.S. 476/2005

బిట్వీన్:
పద్మనాభుని నాగేశ్వరరావు -వాది/ DHR
అండ్
1. మామిడి సత్య వరప్రసాద్
2. మామిడి వెంకటకృష్ణ
-ప్రతివాదులు/ JDRs

పై నెంబరు E.P. గ్రంధములో ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ది. 18-03-2024 సం॥రం తేదీన శ్రీయుత పై కోర్టు వారి ఎదుట బహిరంగముగా వేలం వేయబడును. కావలసినవారు సదరు వేలం పాటలో పాల్గొని సదరు ఆస్తిని కోర్టు వారి షరతులకు లోబడి పాడుకొనవచ్చును.

షెడ్యూలు: పశ్చిమగోదావరి జిల్లా, భీమడోలు సబ్ రిజిస్ట్రీ, ఉంగుటూరు మండలం, నల్లమాడు గ్రామపంచాయతి పరిధిలోని ఆర్.ఎస్. నెం. 103/2ఎ లోని య. 4.34 సెంట్లు ఈ భూమికి హద్దులు.
తూర్పు: గౌతు సత్యనారాయణ భూమి.
దక్షిణం: వడ్లమూడి నరసింహమూర్తి భూమి.
పడమర: కాండేపు సుబ్బారావు భూమి.
ఉత్తరం: సుంకరవల్లి రామచంద్రరావు భూమి.
ఈ హద్దుల మధ్య య. 4.34 సెంట్లు భూమి.
వాది నిమిత్తం: రూ. 4,00,000/-
అమీనా విలువ: రూ. 9,00,000/-

దాసరి ఫణిభూషణ ప్రసాద్
DHr తరపు అడ్వకేట్
తాడేపల్లిగూడెం వెలమపేట, పెంటపాడు
ది.04-3-2024 సెల్: 9849216746

నోటీసు
మహారాజశ్రీ ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్. నెం. 134/2020

బిట్వీన్:
మెస్సర్స్ వెంకటేశ్వర అసోసియేట్స్, పౌల్ట్రి మెడికల్ సప్లయర్స్, డోర్ నెం. 10-179, కెనాల్ రోడ్డు, ద్వారపూడి, మండపేట మండలం, మే॥పా॥ నల్లమిల్లి శ్రీహరిరెడ్డి -వాది
అండ్
1. మెస్సర్స్ నెక్సస్ ఫీడ్స్ లిమిటెడ్, శిసల గ్రామం, కాళ్ల మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
2. గొలుగూరి శ్రీరామరెడ్డి, మేనేజింగ్ డైరక్టర్, మెస్సర్స్ నెక్సస్ ఫీడ్స్ లిమిటెడ్, శిసల గ్రామం, కాళ్ల మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
-ప్రతివాద్లు

టు: 2వ ప్రతివాది:
గొలుగూరి శ్రీరామరెడ్డి, మేనేజింగ్ డైరక్టర్, మెసర్స్ నెక్సస్ ఫీడ్స్ లిమిటెడ్, శిసల గ్రామం, కాళ్ల మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

పై నంబరు దావా నందు 2వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు దావా నందు సమన్లు పంపించిననూ మీరు పుచ్చుకొనక అవైడ్ చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు ఈ పబ్లికేషను ద్వారా మీకు తెలియచేయునది ఏమనగా, పై దావాలో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టులో **ది. 15-03-2024 వాయిదా అయి ఉన్నది. కావున 2వ ప్రతివాది అయిన మీరు పై తేదీన ఉదయం 10.30 గం॥లకు** స్వయంగా గానీ / వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షంలో తీర్మానం చేయబడునని యిందుమూలముగా మీకు తెలియచేయడమైనది.

ఆలమూరు **పి.వెంకట్రావు,** అడ్వకేట్
ది.6-3-24 ఆలమూరు, సెల్:9133101331

కొట్లు అద్దె లైసెన్సు హక్కు టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన

పశ్చిమగోదావరి జిల్లా, నరసాపురం మండలం, నరసాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీ కపిల మల్లేశ్వరస్వామి వారి ఆలయం తాలూకు 11 షాపులను ది. 01-06-2024 నుండి 31-05-2027 వరకు 3 సం॥రంలు అద్దె కొరకు ది. 15-03-2024 సం॥రం తేదీ శుక్రవారం ఉదయం 10.00 లకు సదరు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిచే దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షమున సదరు ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించబడును.

వ.నెం.	షాపు నెం.	షాపు కొలతలు	ఆక్షన్ డిపాజిట్ రూ.
1	షాపు నెం.1	10.4×11	10,000/-
2	షాపు నెం.2	9.8×7.5	10,000/-
3	షాపు నెం.3	9.8×7.10	10,000/-
4	షాపు నెం.4	8.11×18.7	10,000/-
5	షాపు నెం.5	8.11×9.4	10,000/-
6	షాపు నెం.6	9.2×9.9	10,000/-
7	షాపు నెం.7	7.10×9.2	10,000/-
8	షాపు నెం.8	6.4×5.11	10,000/-
9	షాపు నెం.9	6.3×6	10,000/-
10	షాపు నెం.10	5.10×8.3	10,000/-
11	షాపు నెం.11	22×15.3	10,000/-

ముఖ్యమైన పాట షరతులు: 1. సదరు వేలం పాట సదరు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిచే నిర్వహించబడును. 2. ఇతర వివరములకు కార్యాలయము పనిచేయు వేళలలో సంప్రదించవలెను.

సం/- కార్యనిర్వహణాధికారి
నరసాపురం శ్రీ కపిల మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం
తేది.05-03-2024 నరసాపురం, ప॥గో॥జిల్లా, 89852 16805

గ్రామపంచాయతీ కార్యాలయం, ఆచంట వేమవరం
ఆచంట మండలం, పశ్చిమగోదావరి జిల్లా
టెండరు నోటీసు

రి.క.నెం./2024 తేది.6-3-2024

పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం, ఆచంట వేమవరం గ్రామపంచాయతీకి 2024-25 సం॥నకు అనగా ది. 1-4-2024 నుండి 31-3-2025 వరకు ఈ దిగువ షెడ్యూలు నందు ఉదహరించిన పనులు చేయుటకు మరియు అయిటములు సప్లయి చేయుటకు సీలు టెండర్లు ది. 18-3-2024వ తేది మధ్యాహ్నం గం॥ 2.00ల వరకు గ్రామపంచాయతీ కార్యాలయము వద్ద పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతి పొందిన వారిచే గాని గ్రామపంచాయతీ వద్ద సీల్డు వేసిన టెండర్లు స్వీకరించబడును. సదరు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం॥ 2.30 గం॥లకు అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షములో తెరువబడును. టెండరు దాఖలు చేయువారు షెడ్యూలు నందు పేర్కొనబడిన ధరావత్తు చెల్లించి టెండరు దాఖలు చేయవలెను. మిగిలిన వివరములు ఈ కార్యాలయము పని వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	వివరములు	చెల్లించవలసిన ధరావత్తు
1	వీధిలైట్లు మరియు విడి సామానులు సప్లయికి	రూ.50/-
2	పి.డబ్ల్యు.ఎస్. సామానులు సప్లయి చేయుటకు	రూ.50/-
3	పబ్లిక్ హెల్తు సామానులు సప్లయి చేయుటకు	రూ.50/-
4	స్టేషనరీ సామానులు సప్లయి చేయుటకు	రూ.50/-
5	పారిశుధ్య సిబ్బంది నియామకాలు కాంట్రాక్టు పద్ధతి-6	రూ.50/-
6	పంపు ఆపరేటర్స్ కాంట్రాక్టు పద్ధతి-3	రూ.50/-
7	వీధి లైట్లు రిపేరు కాంట్రాక్టు పద్ధతి-2	రూ.50/-
8	గ్రీన్ గార్డ్-1	రూ.50/-
9	పి.డబ్ల్యు.ఎస్. సిబ్బందికి దుస్తులు, సబ్బులు, చెప్పులు, టవల్స్, కొబ్బరినూనెకి	రూ.50/-

సం/- జక్కంశెట్టి చంటి, సర్పంచ్
గ్రామపంచాయతి, ఆచంట వేమవరం
ఆచంట మండలం, ప॥గో॥జిల్లా

సం/- పిన్నింటి చంద్రశేఖర్, పంచాయతి కార్యదర్శి
గ్రామపంచాయతి, ఆచంట వేమవరం
ఆచంట మండలం, ప॥గో॥జిల్లా